కాంగ్రెస్ పార్టీలో చేరిన 'గొట్టిముక్కల'



కూకట్‌పల్లి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మల్లురవి, కూకట్‌పల్లి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి బండి రమేష్‌ల సమక్షంలో జీవీఆర్ అభిమానులు, బీఆర్‌యస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కూకట్‌పల్లిలో ముగ్గురు నామినేషన్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జరగబోయే ఎమ్మెల్యే ఎన్నికల్లో బుధవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఇండియా ప్రజాబంధు పార్టీ తరపున మామిళ్ల ఆనంద్, మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ తరపున చుక్కా తిరుపతి, ప్రజా ఏక్తా పార్టీ తరపున మీదింటి అచ్యుతానంద్‌లు నామినేషన్‌లు దాఖలు చేశారు. ఈ మేరకు మూసాపేటలోని జీహెచ్‌యంసి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి వారు నామినేషన్ పత్రాలను అందజేశారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌కు మద్దతుగా హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజ న్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు విద్యాకల్పన ఏకాంత్ గౌడ , యాదగిరి, మూకయ్య, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ నేతలు



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ వివేకానందనగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు విద్యాకల్పన ఏకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ జగదీశ్వర్‌గౌడ్‌కు మద్దతు తెలుపుతు బీజేపీ వివేకానందనగర్ డివిజన్ బీజేపీ మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి సంధ్య మహేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో దయాకర్‌రెడ్డి, శృతి గౌడ్‌లు పాల్గొన్నారు.

రూ.52.50 లక్షల నగదు స్వాధీనం



బాలానగర్: బాలానగర్ పోలీసులు, ఎస్ఓటీ సిబ్బంది మంగళవారం రాత్రి సంయుక్తంగా చేపట్టిన వాహనాల తనిఖీలో భాగంగా బాలనగర్ శోభన బస్‌స్టాప్ సమీపంలో ఓ వాహనంలో తరలిస్తున్న రూ.52లక్షల 50 వేలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ భాస్కర్ వివరిస్తూ, మంగళవారం రాత్రి రెండు గంటల ప్రాతంలో రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి పత్రాలు లేని అక్రమంగా తరలిస్తున్న రూ.52.50 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి తరలిస్తున్న డబ్బును సీజ్ చేస్తామని తెలిపారు. రూ. 50 వేలకు మించి నగదు తరలిస్తున్న వారంతా అందుకు సంబంధించిన ధృవపత్రాలు కలిగి ఉండాలని సిఐ భాస్కర్ సూచించారు.

'పైరవీలతోనే పార్ట్‌టైం అధ్యాపకుల ఉద్యోగాలు'

ఉస్మానియా యూనివర్సిటీ: నింబంధనలను ఉల్లంఘించి పైరవీలు చేసే వారికే ఓయూ పార్ట్‌టైం అధ్యాపక ఉద్యోగాలు లభిస్తున్నాయని డాక్టర్ జ్యోతిపద్మజా ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై గత నాలుగు రోజులుగా భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న ఆమె నియామకాలపై అనేక ఆరోపణలు చేశారు. ఇటీవల ఓయూ కెమిస్ట్రీ విభాగంలో జరిగిన పార్టుటైం అధ్యాపకుల నియామకాలలో అక్రమాలు జరిగాయన్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో ఇంటర్వ్యూ సమయంలో తనను అవమాన పరిచేలా ప్రొఫెసర్ల నవ్వుకున్నారని జ్యోతిపద్మజా ఆరోపించారు. గోల్డ్‌మెడల్స్, పీహెచ్‌డీ, బోధన అనుభవం గల అభ్యర్థులను విస్మరించి రాత పరీక్ష, ఇంటర్వ్యూలకు హాజరు కాకున్నా కేవలం పైరవీలు చేసిన వారినే ఉద్యోగాలలో నియమించారన్నారు. ఉద్యోగాల భర్తీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు.

స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ కోర్సులో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 15న ప్రారంభమై సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు కొనసాగనున్న ఏ-సర్టిఫికెట్ కోర్సెస్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాల్టీ డెవలప్‌మెంట్‌లో ప్రవేశానికి 14 వరకు దరఖాస్తు చేసుకోవాలని సెల్ట్ డైరెక్టర్ ప్రొ.సవీన్ తెలిపారు. పూర్తి వివరాలకు 7989903001 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ముస్తాబవుతున్న అథ్లెటిక్ సింథటిక్స్ ట్రాక్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఏ- గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న అథ్లెటిక్ సింథటిక్స్ ట్రాక్ ప్రారంభానికి ముస్తాబవుతోంది. ఖేలో ఇండియా పథకంలో భాగంగా కేంద్రం విడుదల చేసిన రూ.13 కోట్ల నిధుల్లో రూ.5.5 కోట్లతో నాలుగు వందల మీటర్లతో నిర్మిస్తున్న సింథటిక్ ట్రాక్ తుది మెరుగులు దిద్దుకుంటుంది. వచ్చేనెల చివరి వారంలో ప్రారంభించనున్నట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్‌కుమార్ తెలిపారు.

అల్లాపూర్ డివిజన్‌ను ఎంతో అభివృద్ధి చేశా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు • అల్లాపూర్‌లో ట్రాఫిక్ కష్టాలు తీర్చడానికి కైత్లాపూర్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేశాం



ప్రచారంలో పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం స్థానిక కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి అల్లాపూర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో అసోసియేషన్ సభ్యులు, ప్రజలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లాపూర్ డివిజన్ ఒకప్పుడు రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక సదుపాయాలు వంటివి లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని, పదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో సీసీ రోడ్లను నిర్మించామన్నారు. అదే విధంగా 24 గంటల కరెంటు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా ఇక్కడ సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని అన్నారు. ప్రధానంగా రామారావునగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని కైత్లాపూర్‌లో ఫ్లై ఓవర్‌బ్రిడ్జి నిర్మాణంతో పాటు పలు సీసీ రోడ్లను నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించామన్నారు. దశాబ్దాలుగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఏనాడు ప్రజల సమస్యలు పట్టించుకోలేదన్నారు. ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రాన్ని వేరే పార్టీల చేతుల్లో పెట్టి ఆగంచేసుకోవద్దని కేవలం ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఇందుకు నిదర్శనంగా పదేళ్ల కాలంలో జరిగిన విప్లవాత్మక మార్పులు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. తిరిగి కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్

మాధవరం కృష్ణారావును గెలిపిద్దాం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని గాయత్రినగర్‌కాలనీ, సుగుణ కోళ్ల అపార్టుమెంట్ వాసులతో జరిగిన సమావేశంలో బుధవారం స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధి గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్‌యస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావు కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వాసుదేవరావు, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్‌బోయినపల్లి: ఓల్డ్ బోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఓల్డ్ బోయినపల్లి డివిజన్ హస్మత్‌పేట్ హనుమాన్ దేవాయలం నుంచి గౌడ బస్తీ, మాల బస్తీ, అబ్రార్ నగర్, కాజాబై లైన్ పీకె కాలనిల్లో ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధి పనులను వివరించి ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా మాధవరం కృష్ణారావును అఖండ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరేందర్ గౌడ్, మక్కల నర్సింగ్‌రావు, ఏనుగుల తిరుపతి, సయ్యద్, ఏజాజ్, ఇర్ఫాన్, మేకల హరినాథ్, లలిత, కనకరాజు, మక్కల సత్యనారాయణ, పోచయ్య, ఖదీర్, సీనియర్ మహిళా నాయకురాళ్లు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ప్రత్యేక ప్రార్థనలు

మూసాపేట: కూకట్‌పల్లి ఎమ్మెల్యేగా మాధవరం కృష్ణారావు గెలవాలని కోరుతూ బీఆర్‌యస్ పార్టీ సీనియర్ నాయకుడు చున్నూ పాషా ఆధ్వర్యంలో గుల్బర్గాలోని హజ్రత్ ఖాజా బందే నవాజ్ దర్గాలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట దర్గా బాబా ఖాజా జమీరుద్దీన్ షా, ఎస్. సుందర్, సయ్యద్ ఫయాజ్, ఎండి ఖాజా పాషా, ఎండి గౌస్ పాషా, ఎండి అబిద్, రఫీక్, టింకు, చైతన్య, అద్నాన్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా గొట్టిముక్కల పద్మారావు జన్మదిన వేడుకలు



కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, సినీనిర్మాత గొట్టిముక్కల పద్మారావు జన్మదిన వేడుకలు కూకట్‌పల్లిలోని ఆయన నివాసంలో బుధవారం ఘనంగా జరిగాయి. జీవీఆర్ యువసేన నాయకులు రాంబాబు, అఖిల్ ఆధ్వర్యంలో నిర్వహించి ఈ వేడుకలకు కూకట్‌పల్లి నలుమూలల నుంచి గొట్టిముక్కల పద్మారావు అభిమానులు, కార్యకర్తలు, అనుచరులు పెద్ద ఎత్తున హాజరై పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు



కూకట్‌పల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్



సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీ పథకాలను తప్పకుండా అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తుందని ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ అభ్యర్థి బండి రమేష్ అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బేగంపేట డివిజన్ మయూరిమార్గ్, అల్లంతోట బావి ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త రేషన్ కార్డుల ఊసే లేదన్నారు. పథకాల విషయంలో కల్లబొల్లి హామీలను ఇస్తూ ప్రజలను మోసం చేస్తుందన్నారు. అవినీతి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలందరు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల సంక్షేమం కోసం పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు గౌరపల్లి రమేష్, హోసి, రమాదేవి, రాధా, విజయ్ కుమార్, శ్రీనివాస్, కిష్టరెడ్డి, సాంయ్య, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రేపు పీఎఫ్‌కార్యాలయంలో భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమీషనర్ డా. హేమంత్ తెలిపారు. ఈ నెల 19న ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులో గల పీఎఫ్ కార్యాలయంలో ఉంటుందని, ఖాతాదారుల తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక, సలహాలు, సూచనలు కూడా స్వీకరిస్తామని అన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బిహెచ్ఇఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొనవచ్చని అన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఐడీపీఎల్ బస్‌స్టాప్‌లో చనిపోవటంతో సమీపంలోని వ్యక్తులు సమాచారం ఇవ్వటంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. గత 3 నెలల నుంచి ఆ చట్టు పక్కల భిక్షాటన చేస్తూ బస్‌స్టాప్‌లోనే నిద్రిస్తున్నాడని తెలిపారు. మృతుడి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. కుడికాలిపై కమిలిన పాత గాయం ఉంది. అనారోగ్యంతో చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

నామినేషన్ దాఖలు చేసిన అరెకపూడి గాంధీ



నామినేషన్ వేయటానికి బయలుదేరిన బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ



ఆల్విన్‌కాలనీ: బీఆర్ఎస్‌పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ముందుకు ఆయన నివాసం నుంచి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆయనకు నీరాజనాలు పలికారు. ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, కార్పొరేటర్‌ర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, ఉప్పలపాటి శ్రీకాంత్, రోజాదేవి రంగారావు, మంజుల రఘునాథ్ రెడ్డి, సింధు ఆదర్శ్ రెడ్డిలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేకానందనగర్‌లోని రామాలయం, హైదర్‌నగర్‌లోని విజయదుర్గ మైసమ్మ ఆలయం, గంగారంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందానగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అక్కడి నుంచి ర్యాలీగా వచ్చి శేరిలింగంపల్లి డివజిన్ పరిధిలోని తారానగర్ తుల్జాభవానీ దేవాలయం వద్దకు చేరుకుని ఆనవాయితీగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. జోనల్ కార్యాలయానికి చేరుకొని కార్పొరేటర్‌లతో కలిసి నామినేషన్ పత్రాలను అందజేశారు.

ఇండిపెండెంట్ అభ్యర్థిగా అరెకపూడి శ్యామలదేవి నామినేషన్..

శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా అరెకపూడి గాంధీ భార్య శ్యామలదేవి తన నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు.

కూకట్‌పల్లి టికెట్ జనసేనకు ఎలా కేటాయిస్తారు?



మాట్లాడుతున్న మాధవరం కాంతారావు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పలి బీజేపీ కార్యాలయంలో బుధవారం అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి బీజేపీ భవిష్యత్ కార్యాచరణ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు మాట్లాడుతూ కూకట్‌పల్లి అసెంబ్లీ టికెట్ విషయంలో పొత్తులో ఉన్న జన సేన పార్టీకేనంటూ వస్తున్న వార్తలను ఎప్పటికప్పుడు ఖండిస్తూ కూకట్‌పల్లి అసెంబ్లీ టికెట్ ఎట్టిపరిస్థితుల్లోనూ బీజేపీ అభ్యర్థికే ఇవ్వాలని బీజేపీ అధిష్టానానికి తెలిసేలా పలు నిరసన కార్యక్రమాలు సైతం చేయటం జరిగిందన్నారు. ఏళ్లుగా పోలింగ్‌బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేశామన్నారు. కనీస క్యాడర్ లేని జనసేప పార్టీకి టికెట్ ఎలా ఇస్తారని ఆయన మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర నాయకులు సూర్యరావు, సూర్యప్రకాష్, వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

పొదుపు సంఘాలపై ఫోకస్!

సికింద్రాబాద్: ఎన్నికలు వచ్చాయంటే చాలు ఎప్పుడు కనబడని సంఘాలు ప్రాచుర్యంలోకి వస్తాయి. అంతేకాదు ఇదే సమయంలో కుల, యువజన, మహిళా సంఘాలకు ఉన్న పలంగా ప్రాధాన్యం వస్తోంది. త్వరలో జరగనున్న ఎన్నికల సందర్భంలోనూ లష్కర్‌లో అదే జరుగుతుంది. నిన్న మొన్నటి వరకు సంఘాలకు అంతగా ప్రాధాన్యం ఇవ్వని నేతలంతా ఒక్కసారిగా ప్రేమాఅభిమానాలు కురిపిస్తున్నారు. ఆయా సంఘాల ప్రతినిధులను మచ్చిక చేసుకునేందుకు'పోటీ పడుతున్నారు. సంఘాలకు భవనం నిర్మించుకోవడం, సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాల పేరిట నజరాలు పొందడం కోసం ఇదే సరైన సమయంగా ఆయా సంఘాల నిర్వాహకులు భావిస్తున్నారు.

పుట్టుకొస్తున్న సంఘాలు..

తమ సమస్యలు చెప్పుకోవడానికి, ఇందుకోసం నాయకుల ద్వారా అవసరమైన సహాయాలు, హామీలు పొందడం కోసం ఇదే సరైన సమయంగా భావిస్తున్నారు. ఎన్నికల తేదీ దగ్గర పడుతున్న తరుణంలో మూలన పడుతున్న సంఘాలకు కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా మూలపడిన సంఘాలు, చెల్లాచెదురైన సభ్యులను కూడా ఎన్నికల సందర్భంగా రాజకీయపార్టీల నాయకులు నిద్రలేపుతున్నారు. వారిని మళ్లీ ఒక్కటి చేస్తున్నారు. కండువాలు కప్పి ఆ పార్టీల్లో చేర్చుకుంటున్నారు. సంఘాల ప్రతినిధులకు డబ్బులు అందిస్తున్నారు. భవిష్యత్ అవసరాలకు హామీలు ఇస్తున్నారు. శాసనసభ ఎన్నికల పుణ్యామాని సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో సంఘాలకు తాజాగా మరోమారు విపరీతమైన రాజకీయ ప్రాధాన్యం లభిస్తుంది.

చేర్చుకునేందుకు కసరత్తులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సికింద్రాబాద్‌లో మహిళా పొదుపు సంఘాలకు సైతం రాజకీయ ప్రాధాన్యం పెరిగింది. ఎన్నికల సందర్భాల్లో సాధారణంగా రాజకీయ పార్టీలు బూత్‌ల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి వారికి నజరానాలు అందిస్తారు. పొదుపు సంఘాలకు ప్రాధాన్యత పెరగడంతో రాజకీయ పార్టీల నాయకులు మహిళా సంఘాల ప్రతినిధులతో కూడా ప్రత్యేక బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. సంఘాల సభ్యులందరికీ నగదు నజరానాలు అందిస్తున్నారు. నియోజకవర్గంలో అన్ని పొదుపు సంఘాల్లో మొత్తంగా 2 వేల వరకు మహిళలు ఉన్నారు. వీరందకీ రాజకీయ సహాయం చేసి ఓట్లను పొందేందుకు కసరత్తులు చేస్తున్నారు.

వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక



బాలానగర్: జేఎన్‌టీయూనివర్సిటీలో సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ డా. ఎస్ఎస్ దిలీప్, జెఎన్‌టీయూ క్యాంపస్ కాలేజీ స్పోర్ట్స్ ఫిజికల్ డైరెక్టర్ డా. ఎస్ అశోక్ పర్యవేక్షణలో యూనివర్సిటీ పరిధిలోని పలు ఇంజనీరింగ్ కాలేజీల బాలికల వాలీబాల్ క్రీడాకారులను ఎంపిక చేశారు. యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్టర్ డా. ఎస్. తార కళ్యాణి, యూనివర్సిటి క్యాంపస్ కాలేజి ప్రిన్సిపాల్ డా. .కె. విజయకుమార్ రెడ్డి భహాజరయ్యారు.

మమ్మల్నెలా అడ్డుకుంటారు?

కుత్బుల్లాపూర్: పద్దెనిమిది నెలలుగా జీతభత్యాలు లేకుండా తాము ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించకుండా కాలయాపన చేస్తున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధుల తీరుకు వ్యతిరేకంగా జీడిమెట్ల పారిశ్రామికవాడ సూపర్ మాక్స్ కంపెనీ కార్మికులు శాసనసభ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నుంచి పోటీ చేసేందుకు కొందరు నామినేషన్ పత్రాలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో బుధవారం కూడా జేఏసీ నాయకులు కార్మికులతో కుత్బుల్లాపూర్ రిటర్నింగ్ కార్యాలయానికి నామినేషన్ పత్రాలు పొందేందుకు తరలివచ్చారు. అయితే అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు వీరిని లోనికి అనుమతించలేదు. 144 సెక్షన్ నిబంధన అమలులో ఉందని, ఇప్పుడు లోనికి అనుమతించడం కుదరదని తేల్చి చెప్పారు పోలీసులు. సాయంత్రం 4.30 గంటల సమయం తర్వాత రిటర్నింగ్ కార్యాలయానికి వచ్చి నామినేషన్ పత్రాలు పొందవచ్చని పోలీసులు చెప్పినట్లు కార్మికులు మీడియా ప్రతినిధులతో పేర్కొన్నారు.

నిన్న అనుమతించి.. ఇప్పుడేమైంది?

అర్ ఓ కార్యాలయం వద్ద బందోబస్తులో ఉన్న పోలీసుల తీరును ప్రశ్నిస్తున్నారు కార్మికులు. మంగళవారం నామినేషన్ పత్రాలు కోసం వచ్చిన తమ కార్మికులను ముగ్గురు ముగ్గురు చొప్పున నామినేషన్ పత్రాలు పొందేందుకు అనుమతించారు. కానీ ఈరోజు 144 సెక్షన్ అంటూ లోనికి అనుమతించకుండా ఉండటంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిన్న రిటర్నింగ్ కార్యాలయంలోనికి వెళ్లడానికి అడ్డురాని 144 సెక్షన్ నిబంధన ఈ రోజు ఎందుకు అడ్డు వచ్చిందని వారు ప్రశ్నిస్తున్నారు. మంగళవారం 30 మంది కార్మికులు నామినేషన్ పత్రాలు తీసుకువెళ్లగా, బుధవారం మరో 24 మంది తీసుకువెళ్లడంతో వీరి సంఖ్య 54కు చేరుకుంది.